19012025-DIS-04_Layout 1 1/19/2025 3:02 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పేదలను రేషన్‌కార్డులకు దూరం చేస్తరా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు రేషన్‌కార్డులను దూరం చేయాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం నాడు కేసీఆర్ సర్కార్ ఆదాయ పరిమితిని, భూపరిమితిని పెంచిందని.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక మార్గదర్శకాల ప్రకారం రేవంత్ సర్కార్ ఆ మార్గాన్నే అనుసరించాలని సూచించారు. ఇటీవల కులగణన సర్వే సందర్భంగా సర్కార్ చెప్పిందొకటి, రేషన్‌కార్డుల విషయంలో ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గం మరొకటని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుల జారీ విషయంలో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ యథాతథంగా..

తన్నీరు హరీశ్‌రావు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి..

రేషన్‌కార్డులు జారీ చేసే విషయంలో మీ ప్రభుత్వం కోతలు పెడుతూ, పేద ప్రజలను మోసం చేయాలని చూడటం దుర్మార్గం. అభయహస్తం మ్యానిఫెస్టోలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొందరికే పరిమితం చేసే విధంగా నిబంధనలు రూపొందించి, అమలు చేస్తుండటం ముమ్మాటికీ మోసం చేయడమే. క్షేత్రస్థాయిలో ఎలాంటి అధ్యయనం చేయకుండా, అర్హులైన వారికి ఎగనామం పెట్టే విధంగా ఉన్న నిబంధనలను, మీ వైఖరిని బీఆర్‌ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నది. యావత్ తెలంగాణ ప్రజల తరపున నిలదీస్తున్నాం.

తెలంగాణ పౌరసరఫరాల శాఖ 2025 జనవరి 12న మెమో నంబర్ ఐటీ -2/2196/2025తో ఇచ్చిన ఉత్తర్వుల్లోని నిబంధనలను లక్షలాది మంది నిరుపేదలకు రేషన్‌కార్డు దూరం చేసే విధంగా రూపొందించడం శోచనీయం. 2025, జనవరి 11న పౌరసరఫరాల శాఖ జారీచేసిన మెమో (మెమో నెంబర్1784/ సీఎస్.ఐ-సీసీఎస్ /2024) ప్రకారం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుంటున్నామని స్పష్టం చేశారు. అంతేకాదు, గతంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన మెమో నెంబర్ 653/మండల్స్/ ఏ1/2014, పౌరసరఫరాల శాఖ మెమో నెంబర్ 900/ సీఎస్.ఐ-సీసీఎస్ /2024 నిబంధనలను పాటిస్తామని తెలిపారు. పదేండ్ల కిందటి నిబంధనలను యథాతథంగా ఇప్పుడు అమలు చేయడమంటే కోతలు విధించి, లక్షల మంది అర్హులను దూరం చేయడమే. లబ్ధిదారులకు మొండిచెయ్యి చూపడమే.

2014 అక్టోబర్ 10 నాటికి అమల్లో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిబంధనలను యథాతథంగా పాటిస్తే లక్షల మంది నిరుపేదలు రేషన్‌కార్డులు పొందేందుకు అనర్హులవుతారని గుర్తించి అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసింది. అందులో భాగంగా ఆదాయం, భూపరిమితిలో సడలింపులు చేస్తూ 2014 నవంబర్ 28న ఉత్తర్వులు జారీచేసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.60 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 వేలు ఉంటే, ఆ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలకు పెంచింది. అదే విధంగా మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట 5 ఎకరాలుగా ఉన్న భూ పరిమితిని.. మాగాణి మూడున్నర ఎకరాలకు, మెట్ట ఏడున్నర ఎకరాలకు పెంచింది. తద్వారా లక్షల మంది నిరుపేదలకు రేషన్‌కార్డు పొందే అర్హతను కేసీఆర్ ప్రభుత్వం కల్పించింది.

ఇప్పుడు మీ ప్రభుత్వం, పది సంవత్సరాల కిందటి నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ఇప్పటికీ అవే ఆదాయ, భూపరిమితుల నిబంధనలను కొనసాగించడం వల్ల లక్షల కుటుంబాలు రేషన్‌కార్డు పొందే అర్హతను కోల్పోతున్నాయి. ఉదాహరణకు 2014లో అంగన్‌వాడీల వేతనం రూ.4,200 ఉండేది. కేసీఆర్ ప్రభుత్వం మూడు దఫాలుగా పెంచి వారి వేతనాన్ని రూ.13,650కి చేర్చింది. 2014లో వీరి వార్షికాదాయం రూ.50,400 ఉండగా, పెరిగిన వేతనం ప్రకారం ఇప్పుడు వారి వార్షికాదాయం రూ.1,63,800. రేషన్‌కార్డుల జారీలో 2014 నిబంధనలను అనుసరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్తకు రేషన్‌కార్డు రానట్టే. అదేవిధంగా ఆశావర్కర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, చిరు ఉద్యోగులకు మీ ప్రభుత్వ అశాస్త్రీయ నిబంధనల వల్ల రేషన్‌కార్డులు రాని దుస్థితి నెలకొంది.

గడిచిన పదేండ్లలో ద్రవ్యోల్బణం ప్రతి సంవత్సరానికి సగటున 5.42 శాతం ఉందని, పది సంవత్సరాలకు గాను సుమారు 69.60 శాతం ద్రవ్యోల్బణం రికార్డు అయినట్టుగా ఓఈసీడీ అండ్ వరల్డ్ బ్యాంక్ స్పష్టం చేశాయి. దీని ప్రకారం.. 1.7 రెట్లు ధరలు పెరుగుదల నమోదైనట్టుగా అర్థం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షల ఆదాయ పరిమితిని, ద్రవ్యోల్బణం ప్రకారం గణిస్తే రూ.2.55 లక్షలుగా తేలుతుంది. అంటే నాటి 1.50 లక్షలు.. నేటి రూ.2.55 లక్షలతో సమానం. అదే విధంగా పట్టణ ప్రాంత రూ.2.50 లక్షల ఆదాయ పరిమితిని ద్రవ్యోల్బణం ప్రకారం గణిస్తే రూ.3.40 లక్షలు అవుతుంది. అంటే నాటి రూ.2.50 లక్షల ఆదాయం నేటి రూ.3.40 లక్షలకు సమానం. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని అనుసరించి రేషన్‌కార్డుల కోసం కుటుంబ ఆదాయ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో రూ.2.55 లక్షలుగా, పట్టణ ప్రాంతాల్లో రూ.3.40 లక్షలుగా సవరించాలని, తద్వారా పేదలందరికీ లబ్ధి చేకూరే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

2025 జనవరి 12న పౌరసరఫరాల శాఖ ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి కులగణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితా తయారవుతాయని పేర్కొనడం పేద ప్రజల పాలిట శాపంగా మారింది. కులగణన సర్వే తప్పనిసరి కాదని, స్వచ్ఛందమని పేర్కొనడం వల్ల, ఎంతోమంది ఈ సర్వేలో పాల్గొనలేదు. పాల్గొన్నవారిలో చాలా మంది వ్యక్తిగత, వృత్తిపరమైన వివరాలు పంచుకోవడానికి ఇష్టపడలేదు. మంత్రులు సైతం కులగణన సర్వేతో ప్రభుత్వ పథకాలకు ఎలాంటి లంకె ఉండదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడం యావత్ తెలంగాణ ప్రజలను వంచించడమే.

ప్రజా పాలన పేరిట 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 1 వరకు 1.25 కోట్ల దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించింది. ఇందులో సుమారు 10 లక్షల మందిపైగా తమకు రేషన్‌కార్డులు కావాలని కోరినట్టు సమాచారం. కులగణన సర్వే ఆధారంగా కాకుండా ఈ దరఖాస్తుల ఆధారంగా రేషన్‌కార్డులు మంజూరు చేసి, అత్యధిక పేద వర్గాలకు లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. నాడు ప్రతిపక్షంలో ఉన్న మీరు బీఆర్‌ఎస్ పదేండ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని గోబెల్స్ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా వాస్తవాలను తొక్కిపెడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మరోసారి ఈ లేఖ ద్వారా స్పష్టత ఇస్తున్నాం. 2016-17 నుంచి 2022-23 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 6,47,479 కొత్త రేషన్‌కార్డులను అందజేసింది. ప్రభుత్వంలో ఇప్పుడు మీరే ఉన్నరు. ఈ వివరాలను పౌరసరఫరాల శాఖ నుంచి తెప్పించుకొని చూసుకోవచ్చు. ఇకనైనా ఆ అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలని, నిరుపేదలకు ఆసరా అయ్యే రేషన్‌కార్డుల్లో కోతలు విధించకుండా అర్హులందరికీ అందించాలని కోరుతున్నాం. అభయహస్తం మ్యానిఫెస్టోలో రేషన్‌కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా ఈ విషయమై అతీగతీ లేదు. మ్యానిఫెస్టోలో మేము పెట్టకపోయినప్పటికీ రేషన్‌కార్డు ద్వారా కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి ఇచ్చే బియ్యాన్ని 4 కిలోల నుంచి 6 కిలోలకు పెంచాం. కుటుంబానికి 20 కిలోలే ఉన్న పరిమితిని ఎత్తివేసి, ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఇచ్చినం. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టకపోయినా తెలంగాణ ఏర్పడిన ఆరు నెలల్లోనే (జనవరి 1, 2015వ తేదీ నుంచే) మధ్యాహ్న భోజనం, గురుకులాలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేసినం.

ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం, పాలనను గాలికొదిలేయడం మానేసి అభయహస్తం మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టుగా రేషన్‌కార్డులపై సన్న బియ్యం పంపిణీ, అర్హులైన వారందరికీ బీపీఎల్ రేషన్‌కార్డులు, కొత్త రేషన్‌కార్డులు అందించాలి. అన్ని రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా అభివృద్ధి చేసి, రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇవ్వాలని బీఆర్‌ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నా.

రూపాయి పతనం ఆగేదెక్కడ..?

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించడం ఆర్థిక వ్యవస్థపై విస్తృతమైన ప్రభావాన్ని చూపుతున్నది. 2025, జనవరి 13న రూపాయి విలువ 86.62గా నమోదు కావడం రెండేండ్ల అత్యల్ప స్థాయిని సూచిస్తున్నది. ఈ పరిస్థితి రూపాయి బలహీనతను, అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పులను ప్రతిబింబిస్తున్నది.

శ్రీనివాస్ గౌడ్ ముద్దం
80088 88834

అమెరికా ఆర్థిక వ్యూహాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావంతో డాలర్ బలపడింది. డాలర్ ఇండెక్స్ 110 స్థాయిని దాటింది. అమెరికా ఎన్నికల అనంతరం డాలర్ డిమాండ్ పెరగడం రూపాయి పతనానికి కారణమైంది. ముడి చమురు ధరల పెరుగుదల మరో కారణంగా చూడవచ్చు. బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్లకు చేరడం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ఫలితంగా భారత్ వంటి చమురు దిగుమతిదారులపై అధిక భారం పడుతున్నది. భారత మార్కెట్లలో నెగెటివ్ సెంటిమెంట్ పెరగడంతో విదేశీ పెట్టుబడులు తగ్గడం కూడా రూపాయి పతనానికి మరో కారణం అనుకోవచ్చు.

రూపాయి పతనంతో సామాన్య ప్రజలపై భారం పడుతున్నది. పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. దిగుమతులతో సంబంధమున్న వస్తువుల ధరలు అధికమవుతాయి. విదేశీ విద్య భారంగా మారుతుంది. ఎగుమతులపై రూపాయి పతనం ప్రభావం చూపుతుంది. ఎగుమతులకు కొంత కాలం మద్దతు అందించినా, దీర్ఘకాలంలో దిగుమతుల వ్యయాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవడం అవసరం. రూపాయి పతనం ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతాయి. పరిశ్రమలపై ప్రభావం చూపుతుంది. చమురు ఆధారిత పరిశ్రమలు, దిగుమతి వ్యాపార సంస్థలు నష్టాల బారినపడే అవకాశం ఉంటుంది.

రూపాయి విలువ స్థిరీకరణ కోసం ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవాలి.

వడ్డీ రేట్లను సర్దుబాటు చేయడం ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణ చేపట్టాలి. భారతీయ ఉత్పత్తుల పోటీదనాన్ని పెంచేందుకు విధానాలు అమలు చేయడం, కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించడం, ఎగుమతులకు ప్రోత్సాహం అందించడం వంటి చర్యలు సానుకూల ఫలితాలను అందిస్తాయి. అవసరమైన వస్తువుల స్థానిక ఉత్పత్తిని పెంచడం, దిగుమతులను తగ్గించడం, స్వదేశీ చమురు, గ్యాస్ వనరుల శోధన, వాడకం పెంపు వంటి చర్యలు చేపట్టడం వలన రూపాయి పతనాన్ని నిలువరించవచ్చు . మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో స్వదేశీ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పతనాన్ని అడ్డుకోవచ్చు.

రూపాయి పతనం భారత ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ, సమర్థమైన వ్యూహాలను అమలు చేయడం ద్వారా దీన్ని అదుపులోకి తేవడం సాధ్యమే. సత్వర చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపాయి విలువను స్థిరంగా ఉంచడానికి సహాయపడతాయి. భారత ప్రభుత్వం, ఆర్బీఐ కలసి సమన్వయంతో చర్యలు తీసుకుంటే, రూపాయి పతనాన్ని ఆపొచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు.

(వ్యాసకర్త: 'ఫిన్ నౌ' ఫౌండర్)

దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ అయిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. సామాన్య జనాల జీవనస్థాయి రోజురోజుకు తగ్గిపోతూ, కేంద్ర పాలకుల ఆత్మీయులు నిమిష నిమిషానికి ఆర్థికంగా ఎదుగుతూ ఉండటం ఏమి సూచిస్తుంది? మెక్సికో లాంటి దేశాలలో జరుగుతున్నట్టు చివరికి సామాన్య ప్రజలు షాపుల మీద పడి దోచుకునే రోజు రాదా? ప్రజలంతా రెండు విషయాలు ఆలోచించాలి. రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య సోయి లేని ఈ పరిపాలన గురించి ప్రజలు ఏం చేయాలో నిర్ణయించుకునే సమయం వచ్చింది.

తొంగిచూస్తున్న పరాయి పాలన

కనకదుర్గ దంటు
89772 43484

ఇప్పుడు దేశంలో అధికారంలో ఉన్న జాతీయపార్టీలు ఏం చేస్తున్నాయో, ఇదివరకు ఏం చేశాయో అర్థం చేసుకోవాలి. పరిష్కార మార్గాన్ని కనుక్కోవాలి. ఏ రాష్ట్ర చరిత్ర చూసినా, స్వాతంత్ర్యానంతరం ఈ 77 ఏండ్లలో తమ రాష్ర్టాన్ని పాలించిన పార్టీల్లో ఏది బాగుందో విశ్లేషించుకోవాలి. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి జరిగిందా, ప్రాంతీయ పార్టీల పాలన బాగుందా పోల్చి లెక్కచూడాలి. ప్రతి రాష్ట్రంలోనూ అతికొద్ది కాలం పాలించినా, ప్రాంతీయ పార్టీల పాలనలోనే రాష్ర్టాల అభివృద్ధి జరిగిందని గ్రహించాలి. అవినీతి కాంగ్రెస్ పార్టీ, సంపన్నుల పక్షపాతి బీజేపీ పార్టీ కంటే కేసీఆర్, నితీశ్ కుమార్, నవీన్ పట్నాయక్, కేజ్రీవాల్ వంటి వారి పాలన బాగుందనే మాట నిర్వివాదాంశం. ప్రాంతీయ పార్టీ అధికారంలో ఉంటే మణిపూర్ మారణహోమం లాంటివి జరిగేవా? అంతేకాకుండా కేవలం ప్రాంతీయ పార్టీయే అని కాదు, వారికి ప్రాంతం మీద ప్రేమ ఉంటుంది. మన రాష్ట్ర ఉదాహరణే తీసుకుందాం. 1948 నుండీ పోలీసు యాక్షన్‌తో జరిగిన అన్యాయాలు, అత్యాచారాలలోంచి తేరుకొని 1952లో తెలంగాణ ప్రాంతీయుని ఆధ్వర్యంలో ఊపిరిపీల్చుకుంటుంటే, 1956లో భాషా ప్రయుక్త రాష్ర్టాల ముసుగులో ఆంధ్ర ప్రాంతాన్ని తెలంగాణలో కలిపారు జవహర్‌లా నెహ్రూ. అటువంటి పరిస్థితిలో ఏం జరుగుతుందో అదే జరిగింది. జాతీయ పార్టీ కాంగ్రెస్ పాలనతో ప్రాంతీయ రాజకీయ నాయకులు మరుగుజ్జులైపోయారు. వలస రాజకీయ నాయకులు యథేచ్ఛగా తెలంగాణ సంపద దోచుకున్నారు.

కాంగ్రెస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం హయాంలో దోపిడీ ఇంకా ఎక్కువైంది. ఎందుకంటే ఇది ప్రాంతీయ పార్టీ అయినా పరాయి ప్రాంత రాజకీయ నాయకులు పెత్తనం చేశారు. ఇక జాతీయ పార్టీ కాంగ్రెస్ అబద్ధాలకు, మాట ఇచ్చి తప్పటానికి తెలంగాణ ప్రాంతం ఎన్నిసార్లు మోసపోయిందో లెక్కేలేదు.

తెలంగాణ నిజమైన ప్రగతి 2014లో ప్రాంతాన్ని ప్రేమించే నాయకుడి పార్టీ అయిన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలోనే మొదలైంది. దేశంలో 7 దశాబ్దాలలో జరగనంత అభివృద్ధి పదేండ్లలో చూశారు రాష్ట్ర ప్రజలు. వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం, విద్యారంగం, సాంఘిక సంక్షేమం, సాంస్కృతిక రంగం- అన్నింటిలోనూ దూసుకుపోయి, అత్యధిక తలసరి ఆదాయం సాధించి దేశానికే ఒక ప్రాంతీయ పార్టీ పాలనలో రాష్ట్రాభివృద్ధి ఎంత పెరిగే అవకాశం ఉందో నిరూపించింది తెలంగాణ రాష్ట్రం తన సొంత పార్టీ ఆధ్వర్యంలో. కాలమహిమో, ఈవీఎం మహిమో తెలియదు కానీ, తెలంగాణకు మళ్లీ గ్రహణం పట్టింది. ఓటుకు నోటు కేసు నిందితుడు, పొరుగు రాష్ట్ర రాజకీయ నాయకుల అభిమానులు రాష్ర్టానికి పాలకులయ్యారు. నిజానికి కేంద్రీయ పార్టీ అయిన బీజేపీకి అధికార దాహం, కాంగ్రెస్‌కు ధన దాహం తప్ప, తెలంగాణ మీద ఆ పార్టీలలో ఉన్న ప్రాంతీయ నాయకులకు ఇసుమంత ప్రేమ కూడా లేదని మళ్లీ రుజువైంది. రాష్ట్రం మళ్లీ దోపిడీకి గురవుతున్నది. కాంగ్రెస్ హై కమాండ్‌కు నిధులు, పక్క రాష్ర్టానికి నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఇక నియామకాల సంగతి సరేసరి. రాష్ట్రం అధోగతి పాలవుతుంటే కొత్త పరిశ్రమల సంగతి దేవుడెరుగు, ఉన్న రియల్ ఎస్టేట్ ప్రిస్టేజ్ కూడా కుప్పకూలింది. ఇక ఈ వలసవాద రాజకీయ నాయకుల దర్శకత్వంలో సాగుతున్న రాష్ట్ర పాలన ప్రజలు ఎన్నాళ్లు భరించగలరు?

నిజానికి కేంద్రీయ పార్టీ అయిన బీజేపీకి అధికార దాహం, కాంగ్రెస్‌కు ధన దాహం తప్ప, తెలంగాణ మీద ఆ పార్టీలలో ఉన్న ప్రాంతీయ నాయకులకు ఇసుమంత ప్రేమ కూడా లేదని మళ్లీ రుజువైంది. రాష్ట్రం మళ్లీ దోపిడీకి గురవుతున్నది. కాంగ్రెస్ హై కమాండ్‌కు నిధులు, పక్క రాష్ర్టానికి నీళ్లు ప్రవహిస్తున్నాయి.

ఈ మధ్య చంద్రబాబు చేసిన ఒక వ్యాఖ్య వింటే నవ్వే కాదు, జాలి కూడా కలిగింది. 1834లో మొట్టమొదటి ఇంగ్లీషు మీడియం స్కూల్ మొదలైన తెలంగాణలో, విద్య అసలు లేదనీ, తానే పాఠశాలలు స్థాపించాననీ చంద్రబాబు చెప్పిన అబద్ధాలు ఎన్నో విన్నాం. ఇక 2014 నుంచీ 2023 దాకా జరిగిన ఆర్థికాభివృద్ధి తన 2020 విజన్ వల్ల వచ్చిందేనని 2004 నుంచీ అధికారంలో లేని చంద్రబాబు డప్పు కొట్టుకోవడం హాస్యాస్పదంగా లేదూ? అంతేకాదు, 2014 నుంచీ 2019 దాక ఆయన కలల రాజధాని ఎంత నిర్మించగలిగాడో కండ్లారా చూశాం. తెలంగాణకు ఆంధ్ర రాజకీయ నాయకుల అభిమానుల పాలన అవసరమా?

ప్రమాదంలో ప్రభుత్వ బ్యాంకులు

ప్రభుత్వ బ్యాంకులు ప్రమాదంలో పడ్డాయి. రాష్ర్టాలను, ఆయా శాఖల నిపుణులను, పార్లమెంటరీ చర్చలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది నిజం. ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నా తొలుత పెద్ద నోట్లను రద్దుచేశారు. దీనివల్ల ఏ లక్ష్యమూ నెరవేరకపోగా, సన్న, చిన్న వ్యాపారులు, రైతులు, కూలీలు దారుణంగా నష్టపోయారు. దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోయింది.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయి. దేశ ఆహార భద్రతకు ప్రమాదమని, రైతులు, వ్యవసాయ నిపుణులు, ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టినా పార్లమెంటులో చర్చకు పెట్టకుండానే కేంద్ర ప్రభుత్వం అప్పట్లో వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. వందలమంది అన్నదాతలు చనిపోయాక కానీ ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. ఆర్థిక అసమానతలకు, సంపద కేంద్రీకరణకు, కార్పొరేట్ల గుత్తాధిపత్యానికి దారి తీస్తుందని నిపుణులు నెత్తీనోరు బాదుకున్నా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలకు, లీజులకు కేంద్రం గేట్లు తెరిచింది. దేశ ఆర్థిక వ్యవస్థకే పెను ప్రమాదమని ప్రపంచబ్యాంకు, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) హెచ్చరిస్తున్నా బ్యాంకుల ప్రైవేటీకరణకు పూనుకొన్నది. స్టేట్‌బ్యాంక్, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లను మాత్రం (ప్రస్తుతానికి) ఉంచి మిగిలిన ప్రభుత్వ బ్యాంకులన్నింటినీ కార్పొరేట్లకు అప్పగించబోతున్నది. ఇది దేశానికి దురదృష్టకరం. ఆర్థిక సంక్షోభాల బారిన దేశం పడకుండా బ్యాంకులు ఎన్నోసార్లు కాపాడాయి.

1990 నాటి ఆసియా సంక్షోభం, 1990-2000 నాటి లాటిన్ అమెరికా, జపాన్ సంక్షోభాల నుంచి ఆయా దేశాలను కాపాడింది బ్యాంకులే. ప్రపంచబ్యాంకు నివేదిక 2013 ప్రకారం 2007-08 నాటి ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడంలో భారతదేశం, చైనా ప్రభుత్వ బ్యాంకులు గణనీయమైన కృషి చేశాయి. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా వ్యవసాయంతోపాటు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు గణనీయంగా నిధులు అందించాయి. నాడు ప్రభుత్వ బ్యాంకులన్నీ 100 శాతం లక్ష్యాలను నెరవేర్చడం వాటి ఘన విజయమే. భారత ఆర్థిక వ్యవస్థను కాపాడిన ప్రభుత్వ బ్యాంకులను ఆదర్శంగా తీసుకుని అమెరికా సహా పలు దేశాలు తమ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాలను గణనీయంగా పెంచుకున్నాయి.

1947 నుంచి 1969 వరకు అప్పటి ప్రైవేటు బ్యాంకులు అన్నదాతలకు అందించిన రుణం కేవలం రూ.100 కోట్లు. బ్యాంకుల జాతీయీకరణ తర్వాత 1969 నుంచి 2020 వరకు వ్యవసాయానికి బ్యాంకులు అందించిన రుణం రూ. 15 లక్షల కోట్లు. నగరాలు, పట్టణాల్లో మాత్రమే ప్రైవేటు బ్యాంకులు సేవలు అందిస్తే, బస్సు కూడా తిరగని మారుమూల పల్లెల్లోనూ ప్రభుత్వ బ్యాంకులు శాఖలు తెరిచి రైతులు, వ్యాపారులకు రుణాలు అందిస్తూ గ్రామీణుల ప్రగతికి బాటలు వేస్తున్నాయి. అంతెందుకు, ప్రభుత్వం గర్వంగా చెప్పుకొనే జనధన్ ఖాతాల్లో 97 శాతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్నవే.

ప్రపంచంలోని టాప్‌టెన్ కుబేరుల్లో ఐదుగురు భారతీయులే ఉన్నారు. కానీ వాళ్లలో ఒక్కరి డిపాజిట్లు కూడా ప్రభుత్వ బ్యాంకుల్లో లేవన్నది నిజం. ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్న రూ.45 లక్షల కోట్ల డిపాజిట్లన్నీ సామాన్య ప్రజలవే. అలాంటి సామాన్యుల డిపాజిట్లకు భద్రత కల్పించే ఎఫ్ఆర్‌డీఐ చట్టాన్ని సడలించి ఆ సొమ్మును కూడా కార్పొరేట్ల రుణమాఫీకి తరలించేందుకు కేంద్రం యత్నించింది. అయితే, పెల్లుబికిన ప్రజా వ్యతిరేకతతో ఆ తర్వాత వెనుకడుగు వేసింది. రిజర్వు బ్యాంక్ ఏర్పడిన తర్వాతి నుంచి 1969 వరకు 1500కుపైగా ప్రైవేటు బ్యాంకులు మూతపడ్డాయి. ఇటీవలి కాలంలో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, లక్ష్మీ విలాస్ వంటి బ్యాంకులు చేతులెత్తేశాయి. దీంతో డిపాజిటర్లు దారుణంగా నష్టపోయారు. అదే సమయంలో ప్రభుత్వ బ్యాంకులు లాభాల బాటలో పయనిస్తున్నాయి. 2009-10 నుంచి 2019-20 మధ్య ప్రభుత్వ బ్యాంకులు రూ. 14,53,341 కోట్లు ఆర్జించాయి. ఇలా లాభాల్లో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరిస్తే కార్పొరేట్లకే లాభం తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు. ప్రభుత్వ బ్యాంకుల్లోని మొండి బకాయిలన్నీ కార్పొరేట్ సంస్థలవే కావడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల సిఫారసుతో రుణాలు పొంది బ్యాంకులకు వేలకోట్లు ఎగనామం పెట్టింది ఇవే. ఇలాంటి ఎగవేతదారులకే కేంద్రం రూ. 7.89 లక్షల కోట్లు మాఫీ చేసింది. నిజానికి పెద్ద బ్యాంకులతోనే దేశానికి అసలు ముప్పు పొంచి ఉన్నది. చిన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి పెద్ద బ్యాంకులను చేయాలనుకుంటున్న కేంద్రం ఈ విషయమై ఆలోచించాలి. దీనివల్ల వేలమంది ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల మరో ముప్పు ఏంటంటే.. ఎంతపెద్ద బ్యాంకు కుప్పకూలితే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అంత భారీగా నష్టపోతుందని ఆర్థికరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2007-08లో అమెరికా, యూరప్ దేశాల్లోని అతిపెద్ద బ్యాంకులు కుప్పకూలడం వల్లే ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలైనట్టు ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చెప్పారు.

పారిశ్రామికవేత్తలకు బ్యాంకు లు పెట్టుకునేందుకు లైసెన్సులు ఇస్తామని ఆర్బీఐ-ఐడబ్ల్యూజీ కమిటీ ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని కమిటీలోని 9/10 మంది వ్యతిరేకించినా కేంద్రం పట్టించుకోలేదు. బ్యాంకింగ్ రంగం పారిశ్రామికవేత్తల వశమైతే అది దేశానికే పెను ప్రమాదమన్న వాస్తవాన్ని గుర్తించాలి. అప్పట్లో ఇలాంటి చర్చే అమెరికాలోనూ జరిగినా ఆ తర్వాత వాస్తవాన్ని గుర్తించి ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

1930 నుంచి 30 ఏండ్లపాటు విజయవంతంగా పనిచేస్తున్న ప్రభుత్వ బ్యాంకును 1968లో అమెరికా ప్రైవేటీకరించింది. ఈ బ్యాంకుతోపాటు మరో ప్రైవేటు బ్యాంకు కుప్పకూలడం వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థ అప్పట్లో అంతగా కుదేలైంది. ఈ రెండు బ్యాంకుల నిర్వాకం వల్ల 5.4 ట్రిలియన్ డాలర్లను అమెరికన్లు కోల్పోయారు. ఈ బ్యాంకులను తిరిగి గాడినపెట్టేందుకు రెండుసార్లు బెయిలవుట్ ప్రకటించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేక తిరిగి వాటిని జాతీయం చేసింది. కాబట్టి ఇవన్నీ చూసైనా ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ఉపసంహరించుకోవాలి.



పాతూరి వెంకటేశ్వరరావు
98490 81889